సాక్షి
కామారెడ్డి
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



వారం రోజుల్లో..
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శివారు కాలనీలలో వారం రోజుల వ్యవధిలోనే రెండు భారీ చోరీలు జరిగాయి.
- 8లో ▸



గ్రామాల అభివృద్ధికి కృషి
గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోం దని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివా స్‌రెడ్డి పేర్కొన్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /21.9

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావ రణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్క డక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకా శాలు ఉన్నాయి.


న్యూస్‌రీల్

బంగారం ధర పైపైకి..

● 10 గ్రాములకు రూ. 1.20 లక్షలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పసిడి ధర రోజుకో కొత్త రికార్డు సృష్టిస్తూ పైపైకి వెళ్తోంది. మంగళవారం కామారెడ్డి బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.20 లక్షలకు చేరింది. ధర ఇలా పెరిగిపోతుండడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. శుభకార్యాలకు బంగారం ఎలా కొనుగోలు చేయాలని ఆవేదన చెందుతున్నారు. పెరుగుతున్న ధరలతో స్వర్ణకారుల ఉపాధి పైనా ప్రభావం పడుతోంది. గిరాకీలు ఉండడం లేదని స్వర్ణకారులు పేర్కొంటున్నారు.

నిజాంసాగర్‌లోకి 75,892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ : ఎగువ ప్రాంతంలో వర్షాలు దంచి కొడుతుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం ప్రాజెక్టులోకి 75,892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు 13 వరద గేట్లను ఎత్తి 1.03 లక్షల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం రాత్రి వరకు 1,403.34 అడుగుల (15.447 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

'వంటిల్లే వైద్యశాల'



కామారెడ్డి అర్బన్ : అన్ని వ్యాధులకు ఆయుర్వేదంలో మంచి మందులున్నాయని, వంటింటినే వైద్యశాలగా మార్చుకోవాలని ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి ఎన్జీవోస్ కాలనీలోని హోమియోపతి, యోగా కేంద్రంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూజలు చేసి, ఉచిత ఆయుర్వేద శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రసాయనిక మందులతో పండించిన కూరగాయలు, ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమన్నారు. ప్రకృతి సిద్ధంగా పండించిన వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా అనేక రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు అందించారు. ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఆకుల శ్రీకాంత్, ఆయుర్వేద వైద్యులు ఉమాదేవి, నీలిమ, దేవయ్య, కీర్తన, రాగసుధ, హారిక, ఫార్మసిస్టులు రాజన్న, జ్యోత్స్న, యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

'శాస్త్రీయ విద్యా విధానాలను రూపొందించాలి'



కామారెడ్డి టౌన్ : ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానాలను రూపొందించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లేపాక్షి హోమ్స్ కమ్యూనిటీ హాల్‌లో టీపీటీఎఫ్ రాష్ట్రస్థాయి అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదులకే పరిమితం కాకుండా సామాజిక ఉపాధ్యాయులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అంతరాలను నిర్మూలించడంలో విద్య ప్రధాన భూమిక వహించాలని, ఇందుకు ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషించాలని పేర్కొన్నారు. తార్కిక భౌతిక వాదం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు – అనంతరం పరిణామాలు, అంతర్జాతీయ పరిణామాలు – భారత సమాజంపై ప్రభావం తదితర అంశాలపై ప్రొఫెసర్ కాశిం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగం, సీనియర్ నాయకులు హన్మాండ్లు, అంబటి నాగయ్య, రమేష్, మనోహర్ రాజు, అశోక్ కుమార్, నన్నెబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నిధుల వరదేదీ?

"జిల్లాలో నష్టంపై పదిహేను రోజుల్లో పూర్తి స్థాయిలో సమీక్షిస్తా. ఈ లోపు అధికారులు క్షేత్ర స్థాయిలో తిరిగి జరిగిన నష్టాలపై సరైన నివేదిక రూపొందించండి. శాశ్వత పరిష్కారం చూపడానికి అయ్యే వ్యయానికి సంబంధించిన నివేదికలు తయారు చేయండి. వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి రెండు జిల్లాల అధికారులతో మంత్రి సీతక్క రివ్యూ చేస్తారు. ఆ లోపు నివేదికలు అందించండి"

– ఈనెల 4న జిల్లాలో పర్యటించిన సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం ఈ ప్రకటన చేసి ఇరవై రోజులవుతున్నా మంత్రి సీతక్క ఇప్పటికీ వరద నష్టంపై సమీక్షించింది లేదు. ముఖ్యమంత్రి రివ్యూ ఊసూ లేదు.

- జిల్లాలో భారీ వర్షాలతో అపార నష్టం
- ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- పక్షం రోజుల్లో సమీక్షిస్తానని హామీ
- ఇరవై రోజులైనా రివ్యూ లేదు, నిధులూ రాలే..
- పునరుద్ధరణకు నోచుకోని వంతెనలు, రోడ్లు, చెరువులు
- దెబ్బతిన్న పంటలకు అందని పరిహారం
- సాయం కోసం రోడ్డెక్కుతున్న రైతాంగం



బూరుగిద్ద గ్రామంలో రైతుల గోడు ఆలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో గతనెల చివరి వారంలో కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదలతో భారీ నష్టం వాటిల్లింది. జనజీవితం అతలాకుతలమైంది. వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వాగులు పొంగి పొర్లడంతో వంతెనలు, రోడ్లు కొట్టుకుపోయాయి. జిల్లా కేంద్రంలో మూడు కాలనీలు నీట మునిగాయి. వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, చెరువులు, ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు రూ. 251.36 కోట్లు అవసరమవుతాయని ఆయా శాఖల అధికారులు అంచనా వేశారు. ఇందులో తక్షణ మరమ్మతుల కోసం రూ. 38.68 కోట్లు, పూర్తి స్థాయి పనులకు రూ.212.68 కోట్లు అవసరం అవుతాయని పేర్కొన్నారు. అయితే ఈనెల 4న జిల్లాలో దెబ్బతిన్న పంటలు, కూలిపోయిన వంతెనలు, కొట్టుకుపోయిన రోడ్లు, వరదలతో నీట మునిగిన ఇళ్లను పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి.. బాధితులను ఆదుకునే బాధ్యత తమదన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కూడా పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నష్టంపై రివ్యూ చేస్తారని, పదిహేను రోజుల్లో తాను సమీక్షిస్తానని సీఎం అన్నారు. ఇరవై రోజులు గడచినా ఇప్పటికీ ఎలాంటి రివ్యూ జరగలేదు. ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజలు నిరాశకు గురవుతున్నారు. స్వయంగా సీఎం పర్యటించి వెళ్లినా ఒనగూరిందేమీ లేదని ప్రతిపక్షనేతలు ఆరోపిస్తున్నారు.

50 వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు..

జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదలతో 50 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. సీఎం పర్యటన సమయంలో 50,028 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. తర్వాత పంట నష్టం లెక్కలు తగ్గించారు. వరదలతో పొలాల్లో ఇసుక మేటలను తొలగించే పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారు. రైతుకు జాబ్ కార్డులు ఉండాలన్న నిబంధనతో చాలా మందికి ఆ అవకాశం కూడా దొరకడం లేదు. ఎకరా పంట సాగుకు తక్కువలో తక్కువ రైతులు రూ.20 వేలు పెట్టుబడులు పెట్టారు. పంట ఎదుగుతున్న సమయంలో దెబ్బతినడంతో మరింత నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడులే దాదాపు రూ. వంద కోట్ల మేర రైతులకు నష్టం జరిగింది. నీట మునిగిన పంటలతో పాటు, వరదలతో కొట్టుకుపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కూడా నిర్వహించారు. ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే పరిహారం ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పెండింగ్‌లో పెడితే మరికొన్ని ప్రాంతాల్లో రైతులు ఆందోళనలకు దిగే అవకాశాలు ఉన్నాయి.

నీటి పారుదల రంగానికి..

భారీ వర్షాలు సృష్టించిన బీభత్సానికి నీటి వనరులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టుతో పాటు కల్యాణి ప్రాజెక్టు, సింగితం రిజర్వాయర్‌తో సహా 203 చెరువులు, కాలువలకు నష్టం జరిగింది. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.5 కోట్లు అవసరమని, పూర్తి స్థాయిలో నిర్మించేందుకు రూ. 44 కోట్లు అవసరమవుతాయని నీటి పారుదల శాఖ అధికారులు నివేదికలు రూపొందించారు.

రోడ్లకు భారీ నష్టం..

పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించి రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. రోడ్లు భవనాల శాఖ ద్వారా పనులు చేపట్టేందుకు రూ. 125.50 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి రూ. 45.50 కోట్లు అవసరమని ప్రతిపాదనలు రూపొందించారు. సీఎం పర్యటన సందర్భంగా ఆయా శాఖల అధికారులు జరిగిన నష్టం వివరాలతో నివేదికలను అందించారు. తాత్కాలిక మరమ్మతులు తప్ప పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటివరకు ఎలాంటి నిధులు రాలేదు. కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డికి వెళ్లే ప్రధాన రహదారిపై లింగంపేట మండలం లింగంపల్లి కలాన్ వద్ద వంతెన దెబ్బతినడంతో బస్సులు నడపలేని పరిస్థితి ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ వంతెనను పరిశీలించారు. ఇక్కడ తాత్కాలిక రోడ్డు నిర్మాణం పనులు మొదలయ్యాయి. కాగా పర్మనెంట్‌గా వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. అలాగే ఎల్లారెడ్డి – మెదక్ రహదారిపై పోచారం ప్రాజెక్టు కింద వంతెన వద్ద ఏర్పడిన గొయ్యితో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో వరదలతో సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు

- వరదలు, వర్షాలతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.
- 1,454 ఇళ్లు దెబ్బతిన్నాయి.
- 118 పశువులు, 53,270 కోళ్లు మత్యువాత పడ్డాయి.
- 334 గ్రామాల్లో 37,313 మంది రైతులకు సంబంధించి 50,028 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.
- 140 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.
- విద్యుత్ శాఖకు సంబంధించి 38 గ్రామాల్లో 864 విద్యుత్ స్తంభాలు , 51.84 కిలో మీటర్ల వైర్లు దెబ్బతినగా.. 589 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి.

సీఎం ప్రకటన కోసం ఎదురుచూపులు..

జిల్లాలో గతనెలలో వచ్చిన వరదలతో జరిగిన నష్టాన్ని స్వయంగా చూసిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో రివ్యూ చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఎన్నడూ లేనంత నష్టం జరిగిన నేపథ్యంలో ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో జరిగిన నష్టానికి సంబంధించి రూ.500 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తేనే న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు సీఎంతో మాట్లాడి ప్రత్యేక ప్యాకేజీ తీసుకురావాలని కోరుతున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక లక్కీ డ్రా

ఖలీల్‌వాడి(నిజామాబాద్): దసరా సందర్భంగా ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక లక్కీ డ్రా స్కీమ్‌ను ప్రకటించిందని ఆర్ఎం జ్యోత్స్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు సెమీ డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి, నాన్–ఏసీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారు లక్కీ డ్రాకు అర్హులని పేర్కొన్నారు. ప్రయాణికులు తమ బస్ టికెట్ల వెనుక పేరు, చిరునామా, ఫోన్ నంబర్ వివరాలు రాసి ఆ టికెట్లను బస్సు స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్స్‌లలో వేయాలని సూచించారు. సేకరించిన అన్ని టికెట్లలో నుంచి అక్టోబర్ 8వ తేదీన రీజినల్ కార్యాలయంలో లక్కీ డ్రా తీయనున్నట్లు తెలిపారు. రీజియన్ నుంచి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామని, నగదు బహుమతులు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ఇస్తామని వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీడ్రాలో పాల్గొనాలని ఆమె కోరారు.

'ప్రీ ప్రైమరీని అంగన్‌వాడీలోనే కొనసాగించాలి'



కామారెడ్డి టౌన్: ప్రీ ప్రైమరీ స్కూలు పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాలలోనే కొనసాగించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ మహాసభలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ. 2 లక్షలు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎన్నిక

యూనియన్ జిల్లా అధ్యక్షురాలిగా ఇందిర, గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా బాబాయి, కోశాధికారిగా సరిత, ఉపాధ్యక్షులుగా లక్ష్మి, యాదమ్మ, అనసూయ, దేవకరుణ, మహాదేవి, సహాయ కార్యదర్శులుగా విజయ, సురేఖ, సునీత, సుమలత, గౌరి, సవిత ఎన్నికయ్యారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మంథని దేవునిపల్లి రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

మాచారెడ్డి : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం చుక్కాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను తనిఖీ చేశారు. గ్రామస్తులతో మాట్లాడి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌తో మాట్లాడి ఎలాంటి వసతులు ఉన్నాయి, ఇంకా ఏ వసతులు కల్పించాలన్న విషయాలు తెలుసుకున్నారు. జిల్లాలోని ఆయుష్మాన్ మందిర్‌లకు కావలసిన సామగ్రికి ప్రతిపాదనలు అందించాలని సూచించారు. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, తహసీల్దార్ సరళ, వైద్యాధికారి ఆదర్శ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న పాల్వంచ మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మంథని దేవునిపల్లి వరకు ఉన్న రోడ్డుకు జరుగుతున్న మరమ్మతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదలతో దెబ్బతిన్న రోడ్లకు త్వరగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఈఈ దుర్గాప్రసాద్, పాల్వంచ తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ స్వామిదాస్, ఏఈ సంజయ్ తదితరులున్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫాం 6,7,8 దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈఆర్‌వోలకు సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు(ఈఆర్‌వో)లతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తులను పరిశీలించి నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాలో తప్పిదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' రిజర్వేషన్లు ఖరారు!

- ఏ స్థానం ఎవరికన్నది సస్పెన్స్‌లో..
- ప్రభుత్వ ఆదేశాలు వచ్చాకే స్పష్టత

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి ప్రక్రియలను పూర్తి చేసిన అధికారులు.. అవసరమైన సిబ్బంది వివరాలను కూడా రెడీ చేశారు. తాజాగా కీలకమైన రిజర్వేషన్ల ప్రక్రియనూ సైతం పూర్తి చేశారు. అయితే రిజర్వేషన్ల వివరాలను వెల్లడించకుండా సస్పెన్స్‌లో ఉంచారు.

ప్రభుత్వ ఆదేశాలతో రెండు రోజులుగా జిల్లా యంత్రాంగం మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక స్థానాలతో పాటు పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేయడానికి కసరత్తు చేస్తోంది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో జిల్లా, డివిజనల్ అధికారులంతా రిజర్వేషన్లపై కసరత్తు చేశారు. ఎట్టకేలకు ఆయా మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతో పాటు ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. పంచాయతీల్లో వార్డులకు సంబంధించి ఆయా మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మొత్తంగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయినట్టేనని భావిస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం అడుగులు వేసింది. అందులో భాగంగా అదే లెక్కతో రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. అయితే రిజర్వేషన్లు ఖరారైన విషయాన్ని బయటకు పొక్కనీయడం లేదు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఎన్నికలకు వెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు భావిస్తున్నారు.

అందరిలోనూ ఉత్కంఠ..

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల వ్యవహారంపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న గ్రామ, మండల స్థాయి నాయకులు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఎలా ఉన్నాయోనని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రిజర్వేషన్లపై ప్రకటన వస్తే పల్లె రాజకీయాలు వేడెక్కనున్నాయి.

మర్పల్లిలో నీటి గోస

నిజాంసాగర్: మర్పల్లి గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మంజీర నది ఉధృతంగా ప్రవహించింది. దీంతో గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే కరెంట్ స్తంభాలు కొట్టుకుపోయాయి. నాలుగైదు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా లేదు. విద్యుత్ లేకపోవడంతో బోరుబావులు పనిచేయడం లేదు. దీంతో గ్రామంలో నీటి సమస్య ఏర్పడింది. మరోవైపు కుళాయిల ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు మంజీర నది నుంచి నీటిని తెచ్చుకుని ఇంటి అవసరాల కోసం వాడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి తుకారాం బ్రాహ్మణపల్లి గ్రామం నుంచి ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించి సరఫరా చేయిస్తున్నారు.



మంజీర నది నుంచి నీటిని తీసుకువెళ్తున్న గ్రామస్తులు

వదలని వరుణుడు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో దాదాపు నెలరోజులుగా రోజూ ఎక్కడో ఓ చోట వర్షం కురుస్తూనే ఉంది. సోమ, మంగళవారాల్లో జిల్లాలోని పలు ప్రాంతాలలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నాగిరెడ్డిపేటలో 74 మి.మీ., పిట్లంలో 71.5 మి. మీ., పాల్వంచ మండలం ఎల్పుగొండలో 71.3 మి.మీ., కామారెడ్డి మండలం పాతరాజంపేటలో 57.8 మి.మీ., జుక్కల్‌లో 47.8 మి.మీ, నస్రుల్లాబాద్ బొమ్మదేవ్‌పల్లిలో 45 మి.మీ., ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌లో 43 మి.మీ, మహ్మద్‌నగర్ మండలం మగ్దుంపూర్‌లో 36.5 మి.మీ., మాచారెడ్డి మండలం లచ్చాపేటలో 32.8 మి.మీ., గాంధారి మండలం సర్వాపూర్‌లో 30.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు కురిసింది. కాగా గత నెలాఖరులో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలు పలు ప్రాంతాలలో బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఆ విపత్తు నుంచి కోలుకోక ముందే మళ్లీ వానలు దంచికొడుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 773.5 మి.మీ. సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా, ఇప్పటికే 1,240.5 మి.మీ. వర్షం కురిసింది. సాధారణంకన్నా 60.4 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదయ్యింది.

క్లుప్తంగా

సూపర్‌మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: కల్తీ సామగ్రిని విక్రయిస్తున్న జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా గల ఓ కిరాణ సూపర్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం సదరు దుకాణంలో నల్ల నువ్వులు, శనగలు ఇతర సామగ్రి కొనుగోలు చేసానని తెలిపారు. రాత్రివేళ నల్లనువ్వులను నానబెట్టడానికి నీటిలో వేయగానే, కాసేపటికి నీరు నల్లరంగులోకి మారాయన్నారు. అలాగే 250 గ్రాములు శనగలు కొనుగోలు చేస్తే 180 గ్రాములు మాత్రమే వచ్చాయన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి, కల్తీ సామగ్రి విక్రయించే దుకాణంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'కంది పప్పు'పై విచారణ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పలు కిరాణ, సూపర్ మార్కెట్, జనరల్ స్టోర్స్‌లలో మంగళవారం మద్నూర్ ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది విచారణ చేపట్టారు. మంగళవారం సాక్షి దిన పత్రికలో 'అంగట్లోకి అంగన్‌వాడీ సరుకులు' అనే వార్తకు ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. మండలంలో అంగన్‌వాడీలకు సంబంధించిన పప్పు, సరుకులు ఎవరు విక్రయించారని అధికారులు ఆరా తీస్తున్నారు. అంగన్‌వాడీ సరుకులు సెంటర్లో ఇవ్వకుండా బయటి మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అంగన్‌వాడీ సిబ్బందికి హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు



పిట్లం(జుక్కల్): పిట్లం ఆర్టీసీ బస్టాండు లోపలికి వెళ్లే ప్రధాన రహదారిపై సోమవారం మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ అయింది. దీంతో భారీగా తాగునీరు వృథాగా పోతున్నాయని సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టారు.

25న ఆత్మీయ సమ్మేళనం

బాన్సువాడ రూరల్: బాన్సువాడలోని లక్ష్మీనర్సింహ కల్యాణ మండపంలో ఈనెల 25న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజుతోపాటు సంఘం రాష్ట్రకమిటీ, రీజినల్ కమిటీ సభ్యులు తదితరులు హాజరవుతారన్నారు.

డైట్ బిల్లులు వచ్చేదెప్పుడో?

- జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లకు కొన్ని నెలలుగా నిలిచిన నిధులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, వార్డెన్లు



అద్దె భవనంలో కొనసాగుతున్న ఆర్మూర్ హాస్టల్

ఆర్మూర్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు కొన్ని నెలలుగా డైట్ బిల్లులు రావడం లేదు. దీంతో విద్యార్థులు, వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు తమ జేబుల్లోంచి డబ్బులు వెచ్చించి, విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని వాపోతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

సరఫరా నిలిచే ప్రమాదం...

హాస్టల్స్‌కు రైస్, పప్పులు, చింతపండు, గుడ్లు, చికెన్, కూరగాయలు, వంటగ్యాస్ సరఫరా జరుగుతున్నప్పటికీ బకాయిలు ఎక్కువ కావడంతో సరఫరాదారులు వెనుకంజ వేస్తున్నారు. ఈ పరిస్థితి మరి కొన్ని రోజులు కొనసాగితే, విద్యార్థులకు ఆహార పదార్థల సరఫరా నిలిచే ప్రమాదం ఉంది. సరఫరాదారులు బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. పలుచోట్ల హాస్టల్ వార్డెన్లు తమ జేబుల్లోంచి డబ్బులు వెచ్చించి, విద్యార్థులకు సమస్యలు రాకుండ చూస్తున్నారు. అలాగే హాస్టల్స్‌లో వందలాది కుక్‌లు, కాంటీన్ సిబ్బంది, వాచ్‌మెన్‌లకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. దీంతో వారు జీతాలు లేకి కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో హాస్టల్స్ నిర్వహిస్తుండగా, ఇంటి యజమానులకు కొన్ని నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

వెంటనే విడుదల చేయాలి..

బిల్లులు రాకపోవడంతో వసతి గృహం నిర్వహణ కష్టంగా మారింది. హాస్టల్ భవనం అద్దె, పిల్లకు కాస్మెటిక్ చార్జీలు కొన్ని నెలలుగా రావడం లేదు. నిధులు లేక జిల్లాలోని వసతి గృహాల అధికారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి. – సౌద సురేష్, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో 84 హాస్టల్స్..

జిల్లాలో మొత్తం 84 ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో బీసీ హాస్టల్స్ 32, ఎస్సీ హాస్టల్స్ 42, ఎస్టీ హాస్టల్స్ 7, ఆశ్రమ హాస్టల్స్ 3 ఉన్నాయి. ప్రతి హాస్టల్‌లో సుమారు 100 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ప్రతి విద్యార్థికి ప్రతినెలా సగటున డైట్ ఖర్చు రూ.1435గా ప్రభుత్వం చెల్లిస్తుంది. 7వ తరగతి వరకు ఒక విద్యార్థికి నెలకు రూ.1330, 8–10 తరగతుల విద్యార్థులకు రూ.1540. పోస్ట్‌మెట్రిక్ స్థాయిలో విద్యార్థికి నెలకు సుమారు రూ.2100 ఖర్చు చేస్తుంది. కానీ ఎస్టీ హాస్టల్స్‌కు జనవరి నుంచి బిల్లులు రావడం లేదు. అలాగే ఎస్సీ, బీసీ హాస్టల్స్‌కు మార్చి నుంచి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో జిల్లాలోని హాస్టల్స్ కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. డైట్ బిల్లులు, రెంట్, చిన్న చిన్న మరమ్మతుల ఖర్చులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో పరిస్థితి దయనీయంగా మారింది. విద్యార్థులకు ఇచ్చే ఆహారం నాణ్యతపై కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలోని హాస్టళ్లకు సంబంధించిన పెండింగ్ డైట్ బిల్లులు రూ.లక్షల్లో ఉన్నాయి. మొత్తంగా హాస్టళ్లకు సుమారు రూ.10కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

మూల మలుపులు.. మృత్యు పిలుపులు



కాస్లాబాద్ నుంచి వడ్లం గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా మూల మలుపు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాస్లాబాద్ నుంచి వడ్లం గ్రామానికి వెళ్లే దారిలో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. 10కి పైగా గ్రామాలు, తండాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. మూలమలుపుల వద్ద కనీసం సూచిక బోర్డులు కరువయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు మొలవడంతో, మూలమలుపు వద్ద వచ్చి పోయే వాహనదారులకు ఏమీ కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మూల మలుపులున్న చోట ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించండి మహాప్రభో..



సంఘమేశ్వర్ వద్ద బీటీ రోడ్డు దెబ్బతినడంతో తాత్కాలికంగా పోసిన మొరం



దోమకొండ నుంచి ముత్యంపేటకు వెళ్లే మార్గంలో కోతకు గురైన రోడ్డు

దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా దోమకొండ మండల కేంద్రం నుంచి ముత్యంపేట, గొట్టిముక్కల, సంఘమేశ్వర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వర్షాలకు రోడ్లపై గుంతలు పడి, ఇరువైపులా కోతకు గురైంది. దీంతో రాత్రి వేళల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గత రెండు రోజుల క్రితం దోమకొండ నుంచి సంఘమేశ్వర్ గ్రామానికి యువకుడు కారులో వెళుతుండగా, ఎడ్లకట్ట వాగు దాటిన తర్వాత కోతకు గురైన రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఈఘటనలో యువకుడు గాయపడగా, కారు సైతం దెబ్బతిన్నది. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను వెంటనే బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లింగంపల్లికలాన్ రోడ్డుకు మరమ్మతులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజర–లింగంపల్లికలాన్ రోడ్డుకు ఎట్టకేలకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 17న 'సాక్షి' దినపత్రికలో 'దెబ్బతిన్న బంజర–లింగంపల్లికలాన్ రోడ్డు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. భారీ వర్షాలతో రోడ్డు రెండు చోట్ల దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ మేరకు రెండు చోట్ల భారీ సిమెంట్ పైపులను ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో మొరం పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారం



నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడి కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తుంకిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి నాయకులు కుమ్మరి రాములు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పాలన అధికారుల విధులివే..

మీకు తెలుసా?

రామారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్లస్టర్ల వారీగా ఒక్కో గ్రామానికి ఒక్కో గ్రామ పాలన అధికారిని నియమించింది. వారు నిర్వహించే విధుల వివరాలు ఇలా ఉన్నాయి.

- గ్రామస్థాయిలో భూఖాతా(విలేజ్ ఎకౌంట్) నిర్వహణ.
- పహాణీల నమోదు.
- రెవెన్యూ మాతృదస్వరం నిర్వహణ
- అన్ని రకాల భూముల నిర్వహణ మార్పులు, చేర్పులు.
- లావుణీ అసైన్డ్, దేవాదాయ వర్క్స్, ప్రభుత్వం సేకరించిన భూముల నిర్వహణ.
- ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, నీటి వనరుల కింద భూముల పరిరక్షణ.
- అన్యాక్రాంతం, ఆక్రమణలపై చర్యలకు సహకరించడం.
- భూమి ఖాతాల నిర్వహణ, మార్పులు, చేర్పులు నమోదు.
- భూ సర్వేకు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే సేవలందించడం.
- ప్రకృతి విపత్తులు సంభవిస్తే నష్టం అంచనా.
- గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించడం.

నిమిషాల్లోనే ఈ-పాన్ కార్డు పొందొచ్చు

సమాచారం..



కమ్మర్‌పల్లి: బ్యాంకులో ఖాతా తెరవాలంటే పాన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. ఇందుకోసం మనం వాడుతున్న సెల్‌ఫోన్‌లోనే దరఖాస్తు చేసుకొని, కొద్ది నిమిషాల్లోనే సులభంగా ఈ-పాన్ కార్డు పొందవచ్చు.

- మొదటగా గూగుల్‌లో 'ఈ-ఫిల్లింగ్' అని టైప్ చేయాలి. తర్వాత ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ హోమ్ పేజీలోకి వెళ్లి ఇన్‌స్టంట్ ఈ-పాన్ అనే ఐచ్ఛికాన్ని ఎంచుకొని 'గెట్ న్యూ పాన్ కార్డు' అని నమోదు చేయాలి.
- తర్వాత ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే జనరేట్ ఆధార్ ఓటీపీ అని సూచిస్తుంది. దాని మీద క్లిక్ చేయగానే ఆధార్ కార్డుకు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ నమోదు చేయగానే ఆధార్‌లో ఉన్న వివరాలు కనిపిస్తాయి. సరి చూసుకుని అనుమతించాలి.
- అనంతరం దరఖాస్తు చేసుకున్నట్లు అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ మన ఫోన్‌కు సందేశం వస్తుంది.
- మళ్లీ మన విన్నపాన్ని ఆమోదించినట్లు కొద్ది గంటల్లోనే సందేశం వస్తుంది.
- రాగానే ఈ-ఫైలింగ్‌లోనే మళ్లీ హోం పేజీకి వెళ్లి ఇన్‌స్టంట్ ఈ-పాన్‌ని ఎంచుకోవాలి.
- డౌన్లోడ్ ఈ-పాన్ మీద క్లిక్ చేసి ఆధార్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ అడుగుతోంది. ఓటీపీ ఎంటర్ చేయగానే పాన్ కార్డు ఫైల్ రూపంలో డౌన్‌లోడ్ అవుతుంది.
- ఫైల్‌ను ఓపెన్ చేయాలంటే పుట్టినరోజు తేదీని ఎంటర్ చేస్తే పాన్‌కార్డు ఓపెన్ అవుతుంది.

సామూహిక సీమంతాలు



ఎల్లారెడ్డి అంగన్‌వాడి కేంద్రంలో సామూహిక సీమంతాలు చేస్తున్న ఏసీడీపీవో ప్రసన్న

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక సీమంతాలను నిర్వహించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు ఏసీడీపీవో ప్రసన్న సామూహిక సీమంతాలు చేశారు. ప్రతి గర్భిణీ పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారని అన్నారు. సూపర్‌వైజర్ హారతి, అంగన్‌వాడి టీచర్ రాజమణి తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో దుర్గామాతకు పూజలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లని దర్శించుకొనేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. కొన్ని చోట్ల అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా.. మరికొన్ని చోట్ల గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. భక్తులు కొందరు భవానీ దీక్ష చేపట్టారు. మండపాల వద్ద భజన కీర్తనలు ఆలపించారు.



బాన్సువాడలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



తాడ్వాయిలోని దుర్గా మాత వద్ద..



లింగంపేట ఎల్లమ్మ ఆలయం దుర్గామాతకు..



భిక్కనూరు దళితవాడ దుర్గాదేవి మండపంలో..



బీబీపేటలో..



బోర్లంలో ...



కామారెడ్డిటౌన్: వీక్లీ మార్కెట్ పెద్దమ్మ ఆలయంలో పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు

స్వగ్రామానికి చేరిన మృతదేహం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల బహ్రెయిన్ దేశంలో మృతిచెందగా, మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. వివరాలు ఇలా.. మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కామటి ఎల్లయ్య(49) మూడు నెలల క్రితం బహ్రెయిన్ వెళ్లాడు. ఈ నెల 12న చాతిలో నొప్పంటూ కుప్పకూలిపోయాడు. వెంటనే ఎల్లయ్యను స్నేహితులు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి బంధువులు, అక్కడి స్నేహితులు మృతదేహం స్వగ్రామానికి వచ్చేలా కృషి చేయడంతో మంగళవారం చేరింది. ఎల్లయ్య మృతదేహాన్ని చూసి గ్రామస్తులు, కుటుంబసభ్యులు కంటతడి పెట్టారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

యువకుడి అదృశ్యం



నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నందిపేట కృష్ణ(33) అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. ఈనెల 19న కూలీ పనులకు వెళ్లిన కృష్ణ ఇప్పటికీ ఇంకా ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. అతడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే మహిళా కానిస్టేబుల్‌ను బెదిరించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని పోచారం ప్రాజెక్టు వద్ద ఇటీవల 'ప్రాజెక్టు వద్దకు ఎవరూ వెళ్లవద్దని' అక్కడ హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సైఫుల్లాఖాన్, మహ్మద్ సనాహుల్లాఖాన్, మహ్మద్ అబ్దుల్ వదూద్ ఖురైషి, లులుఖాన్ అనే వ్యక్తులు సదరు ఫ్లెక్సీని తొలగించి కారులో ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. దీంతో వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని కానిస్టేబుల్ అన్వరీ వారిని హెచ్చరించారు. కానీ వారు వినిపించుకోకుండా కానిస్టేబుల్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు. కారుతో కానిస్టేబుల్‌ను ఢీకొట్టేలా భయపెట్టారు. దీంతో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బోరు మోటారు చోరీ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లోని బోరుమోటారును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బస్టాండ్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆర్టీసీ అధికారులు మంగళవారం బస్టాండ్‌ను సందర్శించి బోరును పరిశీలించారు. వెంటనే డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం పరిధిలోని జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. మండల పరిధిలోని వజ్జపల్లి గ్రామానికి చెందిన లింగాల సాయికుమార్, దూస్‌గాం శ్రీకాంత్ మంగళవారం బైక్‌పై కామారెడ్డి నుంచి వజ్జపల్లి బయలుదేరారు. మండల కేంద్రం సమీపంలో వీరి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

తప్పిపోయిన యువకుడు.. కుటుంబ సభ్యులకు అప్పగింత



ఎల్లారెడ్డి: పట్టణానికి చెందిన ఓ యువకుడు తప్పిపోగా, మండలంలోని ఓ వ్యక్తి అతడిని గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించాడు. వివరాలు ఇలా.. ఎల్లారెడ్డిలోని బీసీ కాలనీకి చెందిన హమీద్ నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డికి వస్తున్నట్లు కుటుంబసభ్యులకు తెలిపాడు. కానీ అతడు ఇంటికి చేరకపోవడంతో కుటుంబసభ్యులు అతడి వివరాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈక్రమంలో ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామానికి చెందిన రామాగౌడ్ హైదరాబాద్‌కు వెళ్లగా బొల్లారం రైల్వేస్టేషన్ దగ్గర అతడికి హమీద్ కనిపించాడు. వెంటనే అతడు హమీద్‌ని కలిసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం హమీద్‌ను అతడి బంధువులకు అప్పగించారు. దీంతో రామాగౌడ్‌ను స్థానికులు అభినందించారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో చోరీకి పాల్పడ్డ నిందితుడికి ఆర్మూర్ కోర్టు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మాలిక్ రహమాన్ తెలిపారు. వివరాలు ఇలా.. తొర్లికొండ గ్రామంలోని గడ్డం భూమేశ్వర్ ఇంట్లో మార్చి 27న చోరీ జరిగింది. దుండగుడు ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని డబ్బులు, వంట సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడిగా అదే గ్రామానికి చెందిన నూనె కిరణ్‌ను గుర్తించారు. దీంతో అతడిని పట్టుకొని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి విచారణ జరిపి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు.

వారం రోజులు.. రెండు భారీ చోరీలు

- ఇటీవల నగరంలోని ఓ ఇంట్లో 19తులాల బంగారం, రూ.10లక్షల విదేశీ కరెన్సీ అపహరణ
- తాజాగా అర్చకుడి ఇంట్లో..



ఖలీల్‌వాడి: నగరలో శివారు కాలనీలోని తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. గత వారం రోజుల్లో దుండగులు నగరంలో రెండు భారీ చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల నగరంలోని ఐదో టౌన్ పరిధిలోగల ఆనద్‌బాబానగర్‌లో తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి బీరువాలో ఉన్న 19 తులాల బంగారం, రూ.10లక్షల విదేశీ కరెన్సీని చోరీ చేశారు. ఈ ఘటన మరువకముందే తాజాగా మంగళవారం నాగారంలోని బ్రహ్మణ కాలనీలో ఓ అర్చకుడి ఇంట్లోని 30 తులాల బంగారంను చోరీ చేశారు. వారం రోజుల్లో రెండు భారీ చోరీలు చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

దసరా సెలవుల నేపథ్యంలో..

దసరా సెలువులు రావడంతో కుటుంబసభ్యులు ఇళ్లకు తాళాలు వేసి పిల్లలతో కలిసి బంధువుల ఇళ్లకు వెళుతున్నారు. ఈక్రమంలో దుండగులు తాళం ఉన్న ఇళ్లను గుర్తించి, తమకు అనువైన సమయంలో, జనసంచారం తక్కువ ఉన్న ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లకు వెళ్లినట్లయితే తమకు సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండ, సేఫ్టీ ప్రదేశాల్లో, బ్యాంకు లాకర్లలో ఉంచాలని పేర్కొంటున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

కుటుంబసభ్యులతో కలిసి బయటకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలాగే ఇంట్లో బంగారం, నగదు ఉంచవద్దు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. – బూస శ్రీనివాస్, నార్త్ సీఐ, నిజామాబాద్

బ్రాహ్మణ కాలనీలో 30 తులాల బంగారం దొంగతనం

ఖలీల్‌వాడి: నాగారంలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన పవన్ శర్మ అనే అర్చకుడి ఇంట్లో చోరీ జరిగినట్లు నార్త్ సీఐ బూస శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా.. బ్రాహ్మణకాలనీకి చెందిన పవన్ శర్మ మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి, పూజలు చేయడానికి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం అతడు తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుండగులు ఇంట్లోని లాకర్‌ను ధ్వంసం చేసి, అందులో ఉన్న 30 తులాల బంగారంను ఎత్తుకెళ్లారు. పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చిన ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



లాకర్‌ను పరిశీలిస్తున్న నార్త్ సీఐ బూస శ్రీనివాస్